క్లుప్తంగా

మంత్రిని కలిసిన జేసీ



మంత్రి టీజీ భరత్‌కు మొక్కను అందజేస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను జేసీ నారపురెడ్డి మౌర్య మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి పూల బొకేను అందజేశారు. అనంతరం జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న ప్రసాద్ శర్మ

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, భరత్ హాస్పిటల్ సౌజన్యంతో ఉజ్వల, ప్రగతి మహిళా ఫెడరేషన్ల ఆధ్వర్యంలో ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీలోని ఓ ప్రయివేట్ స్కూలులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించినట్లు సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకోవచ్చని సూచించారు. వైద్యులు రవి, తరుణ్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): మొహర్రం పండుగను పురస్కరించుకుని నిరుపేద హిందూ, ముస్లిం మహిళలకు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ తన క్లినిక్‌లో బుధవారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎన్నో దేశాల్లో మతకలహాలు, కల్లోలాలు ఉన్నాయని, భారతదేశంలో హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నారని చెప్పారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ మొహర్రం పండుగను హిందూముస్లింలు కలిసిమెలిసి జరుపుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు.

షరతుల్లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలి



మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు షరతులు లేకుండా నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతికి సంబంధించి వెంటనే విధి విధానాలు ప్రకటించాలని కోరారు. ఎలాంటి షరతులు విధించకుండా అందరికీ భృతి అందించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత వయసు 45 ఏళ్ల వరకు ఉండడంతో అంతవరకు భృతి ఇవ్వాలన్నారు. నగర కార్యదర్శి బీసన్న, నాయకులు సురేంద్ర, రాజశేఖర్, కృష్ణ, హుస్సేన్‌బాష, కాశీం, శివ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి ప్రశంసలు



డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావును అభినందిస్తున్న సిక్కిం సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్

కర్నూలు(సెంట్రల్): సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లో జరుగుతున్న ఆలిండియా డ్రైవర్స్ కాన్ఫెడరేషన్ సమావేశాల్లో డ్రైవర్స్ అసోసియేషన్ సౌత్‌జోన్ అధ్యక్షుడు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావును ఆ రాష్ట్ర సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్ అభినందించారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ మెమొంటోను అందజేసి సత్కరించారు. డ్రైవర్ల సమస్యలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వై.నాగేశ్వరావు వివరించారు.



మురుగు నీరు లీకేజీ



కంటి వైద్యశాల ఎదుట గుంతల్లో నిలిచిన వర్షపు నీరు





అత్యవసర విభాగం వెనుకవైపు మెడికల్ వ్యర్థాల సంచులు, జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం ముందు లోపించిన పారిశుద్ధ్యం

మురుగు కూపంగా పెద్దాసుపత్రి



నిత్యం వివిధ రకాల చికిత్సల కోసం వేలాది మంది వచ్చే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తచెదారం, మెడికల్ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, మురుగుతో చెత్త దిబ్బలా దర్శనమిస్తోంది. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్తచెదారం కుళ్లి దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు, సహాయకులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్త పేరుకుపోతున్నా తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తుండడంతో డంపింగ్ యార్డులా దర్శనమిస్తోంది. ఇక్కడి పరిస్థితిని చూసి ఆస్పత్రికి వచ్చిన ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మురికి కూపం కారణంగా ఈగలు, దోమలు విజృంభిస్తుండడంతో ఎక్కడ తమకు లేని రోగాలు అంటుకుంటాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకే పెద్ద దిక్కుగా ఉన్న సర్వజన ఆస్పత్రిలో కళ్ల ముందు కనిపించే చెత్తదిబ్బలను తొలగించడంలోనూ ఇంత నిర్లక్ష్యమా అని రోగులు ప్రశ్నిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

← మానసిక రోగుల వార్డు వద్ద చెత్త దిబ్బలా దర్శనమిస్తున్న దృశ్యం



అత్యవసర విభాగం వెనుకవైపు మెడికల్ వ్యర్థాల గుట్టలు, (ఇన్‌సెట్) లోపించిన పారిశుద్ధ్యం

పైప్‌లైన్ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మేయర్ బీవై రామయ్య, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని దిన్నెదేవరపాడులో నూతనంగా నిర్మించిన ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బిల్డింగ్‌కు తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి బుధవారం భూమిపూజ నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బిల్డింగ్ నగరపాలక సంస్థ పరిధిలో లేకున్నా విద్యుత్ శాఖ విన్నపం మేరకు పాలకవర్గం ఆమోదం వ్యక్తం చేసింది. పైపులైన్ నిర్మాణానికి విద్యుత్ శాఖ రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. పనులు పూర్తయిన తరువాత వినియోగించే నీటికి ప్రతినెలా పన్ను చెల్లిస్తారన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్ వైజా అరుణ, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మంచినీటి బోరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

మంత్రాలయం: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధి కట్టడికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధితో గ్రామస్తులు మంచం పట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు గ్రామంలో వైద్య శిబిరం, పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఇప్పుడిప్పుడే గ్రామస్తులు వ్యాధి నుంచి బయటపడుతున్నారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ గ్రామంలో పర్యటించారు. మంచినీటి బోరు, పరిసరాలు, వైద్య శిబిరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యత యుతంగా పనిచేయాలని, వ్యాధి నివారణకు శక్తివంచన లేకుండా శ్రమించాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న ఆల్‌ఫ్రెడ్‌రాజు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 24వ వార్డులో వడ్డె శ్రీను అనే వ్యక్తికి చెందిన గుడిసె అగ్నిప్రమాదంలో కాలిపోయిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక బుధవారం ఫోన్ పే ద్వారా ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు తన వంతుగా రూ.20 వేలు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు ఇన్‌చార్జ్ రుద్రాక్షాల బజారి బాధిత కుటుంబాన్ని కలిసి ప్రమాద వివరాలు తెలుసుకొని పరామర్శించారు. త్వరలో తమ నాయకురాలు బుట్టారేణుక బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్రసాద్, రసూల్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



దిగువపాడులో పీరు ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

కర్నూలు (సిటీ): కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు హిందూ ముస్లింలు ఐకమత్యంగా చేసుకునే పండుగ మొహర్రం. ప్రతిరోజూ పీర్ల స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాంప్రదాయ పద్ధతిలో డప్పు వాయిద్యాల మధ్య ఆటలు, పాటలు నిర్వహిస్తున్నారు. మొహర్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి వీధుల్లో నృత్యాలు చేస్తూ పీర్లను ఊరేగించారు. గ్రామ పెద్దలు, ప్రజలు కుల మతాలకు అతీతంగా పాల్గొని మొహర్రం వేడుకలను సంబరంగా చేసుకున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు: బాలికను హత్యాచారం చేసిన ముగ్గురు మైనర్లు, శవాన్ని మాయం చేసిన నిందితుడి తండ్రి, పెదనాన్నను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు డిమాండ్ చేశారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై బాలిక ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జైలులో పెట్టి సౌకర్యాలు కల్పిస్తే ఏం భయం ఉంటుందన్నారు. ఎన్‌కౌంటర్ చేయాలని లేకుంటే ఆరు నెలల్లో శిక్ష పడేలా చూడాలని కోరారు. ఏపీ రైతు సంఘం నాయకులు సుధాకర్, ఉపేంద్రా, రామకృష్ణ, సుబ్బన్న, లింగస్వామి, స్వాములు, రామకృష్ణ, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



నూతన ఎస్పీ జి.బిందుమాధవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జి.బిందుమాధవ్‌ను బుధవారం నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసిన కమిషనర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన సునీల్

కర్నూలు: కర్నూలు నుంచి అలంపూరుకు వెళ్లే మార్గంలో ధర్మపేట వద్ద రైలు ఢీకొట్టిన ప్రమాదంలో తెలంగాణకు చెందిన సునీల్ (35) తీవ్ర గాయాలపాలయ్యాడు. వ్యక్తిగత పని నిమిత్తం కర్నూలుకు వచ్చిన సునీల్ బుధవారం సాయంత్రం మద్యం సేవించి పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. స్థానికులు గుర్తించి చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కర్నూలు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సూర్య దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు



స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

కర్నూలు(సెంట్రల్): పట్టణంలోని సూర్య దేవాలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్య జలాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వయంగా కలశాలతో సప్త ప్రదక్షిణల అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేశారు. సూర్యనారాయణమూర్తికి విశేష అలంకరణ చేసి అర్చక, మహామంగళ హారతి, మంత్రపుష్పం, వేద స్వస్తి నిర్వహించారు. సూర్యదత్త గోశాలలో భగవద్గీత పారాయణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

జీఓ 117ను రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: పాఠశాలల విలీన ప్రక్రియకు సంబంధించిన జీవో నంబర్. 117ను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం తమ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50,577 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ ఉంటే కేవలం 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి మెగా డీఎస్సీ అనడం సరికాదన్నారు. తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులన్నిటికి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమములో పీడీఎస్‌యూ నాయకులు రమణ, మల్లికార్జున, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్: ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షులు తిప్పన్న, పట్టణ సహాయకార్యదర్శి లక్ష్మన్న, ఏఐటీయూసీ కార్యదర్శి వెంకప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు స్థానిక ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబ జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు.

కేసీ కెనాల్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేయండి



కేసీ కెనాల్ ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): కేసీ కెనాల్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేయాలని, ఎక్కడపడితే అక్కడ ఉన్న చెత్త డంప్‌లను తొలగించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ఆయన బుధవారం నగరంలోని పలు కాలనీలలో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేవీఆర్ కళాశాల వెనుక ఉన్న బాబు జగ్జీవన్‌రావు నగర్‌కు వెళ్లిన మంత్రిని రోడ్లు, డ్రైనేజీలు, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని స్థానికులు విన్నవించారు. ఆనంద్ థియేటర్ వద్ద ఉన్న చెత్త డంప్‌ను తొలగించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, బంగారు పేటలో సామూహిక మరుగుదొడ్ల సమస్య ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ.. వెంటనే మరమ్మత్తులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం పాతబస్తీలోని గడియారం ఆసుపత్రిని మంత్రి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని చెప్పగా.. ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించే ప్రక్రియ జరుగుతుందని కమిషనర్ వెల్లడించారు. నగరపాలక ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, కార్యదర్శి నాగరాజు, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తా

కర్నూలు (అర్బన్): నగరంలో బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా బ్రాహ్మణ నేతలు మంత్రి భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంక్షేమ సేవామిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించినట్లు చెప్పారు. వాటి పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. బ్రాహ్మణ సంఘాల నాయకులు టి.వి.రవిచంద్రశర్మ, శ్రీనివాసరాజు, శ్యాంసుందర్ శర్మ, కిరణ్‌కుమార్, పి.వి.దుర్గా ప్రసాద్ ఉన్నారు.

20న శ్రీశైల గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లకు ఈ నెల 20వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించనున్నారు. పౌర్ణమి రోజున సంప్రదాయబద్ధంగా శ్రీశైల గిరిప్రదక్షిణ, భ్రమరాంబా దేవికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపించనున్నారు. గిరిప్రదక్షిణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవస్థాన అధికారులు బుధవారం విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



ఏకలవ్యుడి చిత్రపటానికి పూజలు చేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్): ఆదివాసి, ఎరుకల వీరుడు ఏకలవ్యుడని వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వై.రాజు, బీసీ జనసభ నాయకులు టి.శేషఫణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎరుకల హరి ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ ఎస్.రామస్వామి, జిల్లా గౌరవాధ్యక్షుడు కుమార్, 34వ వార్డు కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, ఉపాధి, సాంకేతిక రంగాల్లో సమాజం అభివృద్ధి చెందుతున్నా, నేటికి ఎరుకల జాతి అసమానతలకు, అన్యాయాలకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకొని హక్కులు సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు గున్నా మార్కు, ఎరుకల వెంకటస్వామి, మద్దయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• ప్రాణవాయువుతో వ్యాపారం



ఊపిరితిత్తుల విభాగం వద్ద అతికించిన పోస్టర్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులతో కొందరు వ్యాపారం చేస్తున్నారు. ఆసుపత్రిలోని రోగులకు ప్రాణవాయువు అందించే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అద్దెకు సరఫరా చేస్తామని ప్రకటనలు ఇచ్చారు. ఈ మేరకు ఆసుపత్రిలోని ఫీమేల్ మెడికల్ వార్డుతో పాటు ఊపిరితిత్తుల విభాగం వద్ద పోస్టర్లు అతికించారు. కోవిడ్ సమయంలో ఆసుపత్రికి వందకు పైగా ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అప్పటి ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ విరాళంగా అందజేశారు. ప్రస్తుతం ఇవి ఎక్కడున్నాయో?...ఏమయ్యాయో? కూడా అర్థంగాని పరిస్థితి. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు ఏకంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని విభాగాల వద్దే ప్రకటనల పోస్టర్లు అతికించారంటే ప్రైవేటు వ్యాపారుల పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది. – కర్నూలు(హాస్పిటల్)